క్లుప్తంగా

కోళ్ల వ్యర్థాల కట్టడికి చర్యలు


తహసీల్దార్ సుమతి

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దెందులూరు మండలంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కోళ్ల వ్యర్థాల నిలుపుదలకు చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ నీటిలో కాలుష్యం, తద్వారా ప్రజారోగ్యం, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు సత్యనారాయణపురం వంతెన, సీతంపేట, గుండుగొలను, పోతునూరు, కొవ్వలి వద్ద ఆయా గ్రామ వీఆర్ఓలు, వీఆర్ఏలను టీమ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. కోళ్ల వ్యర్థాలను ప్రోత్సహించడం, సహకరించడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ సుమతి హెచ్చరించారు.

వైభవంగా పవిత్రోత్సవాలు


సీతారామస్వామి వారు

భీమడోలు: గుండుగొలనులో అతిపురాతన సీతారామస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఆలయంలో గత 50 ఏళ్లుగా పవిత్రోత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఫౌండర్ కొండ గంగారాజ్ కుమార్ ఆధ్వర్యంలో రెండో రోజు గురువారం రాత్రి నుంచి విశేష పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేసి అమ్మవారికి విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మాలల హక్కుల సాధనకు పోరాటం


మాలమహానాడు నూతన నాయకులతో అనిల్ బాబు

ఏలూరు (టూటౌన్): మాలల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేస్తామని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి అనిల్ బాబు అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాలమహానాడు నగర, మండల నాయకులను నియమించారు. ఏలూరు నగర కార్యదర్శిగా బట్టు శ్రీకాంత్, ఏలూరు మండల ప్రెసిడెంట్‌గా నక్కారవికుమార్, ఏలూరు జిల్లా మాలమహానాడు ఎంప్లాయ్ విభాగం అధ్యక్షుడిగా బట్టు రంగారావులను నియమిస్తూ అనిల్ బాబు నియామక పత్రాలను అందజేశారు. సమాజంలో ఎస్సీలపై జరిగే అన్యాయాలపై పోరాడతామని, మాలల అభివృద్ధికి, మాలల హక్కుల కోసం ఉద్యమించాలని అనిల్‌బాబు అన్నారు. ఈ నెల 17న ఏలూరులో జరిగే మాలజాతి యోధుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగే చైతన్య ర్యాలీకి మాలమహానాడు మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయతం చేయాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు ఏలూరు అధ్యక్షుడు పెనుమాలు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ నిడిగట్టు పద్మారావు, కారే మరియదాసు, ఏలూరు మండల సెక్రెటరీ కర్రి శంకర్, రాగోలు సురేష్, కాలే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహకం

జంగారెడ్డిగూడెం: గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థిని ఎస్ సింధుకు రూ.5 వేల ప్రోత్సాహక బహుమతిని అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు అందించారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ యర్రా అప్పారావు ఆధ్వర్యంలో అధ్యక్షుడు షేక్ పీరా సాహెబ్, కార్యదర్శి ఎన్.రూపాదేవి, సురేష్, రమేష్, నాని, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన సామగ్రి పంపిణీ

కొయ్యలగూడెం: కన్నాపురం జెడ్పీ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన సామగ్రి పంపిణీ చేశారు. వాసవి క్లబ్ సభ్యులు సుమారు రూ.15 వేల సౌజన్యంతో ఈ వితరణ కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా రీజియన్ చైర్మన్ ఉప్పల మణికంఠ సతీష్ పేర్కొన్నారు. 140 మందికి సరిపడా సామగ్రిని అందజేసినందుకు సభ్యులను ఆయన అభినందించారు.

అలరించిన చిన్నారులు

ద్వారకాతిరుమల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు, విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాల నడుమ విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా వీటిని ప్రదర్శించారు. అలాగే పలువురు చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో కనిపించి, కనువిందు చేశారు.

వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు


భీమడోలు : భీమడోలు లైబ్రరీ వద్ద జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సర్పంచ్ పాము సునీత, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగలు


భీమడోలు : అన్నేవారిగూడెంలో జెండాను పట్టుకుని ర్యాలీగా ఊరేగిన చిన్నారులు. పెద్దలు

భీమడోలు: స్వాతంత్ర్య దినోత్సం సందర్భంగా గురువారం వాడవాడలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. ఎందరో త్యాగధనుల ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ భారత్ మాతాజీకి జై అంటూ నినదించారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు జెండాను ఆవిష్కరించారు. పారిశుధ్య కార్మికులను ఆయన దుశ్శాలువాలతో సత్కరించారు. గ్రంథాలయం వద్ద, సచివాలయాల్లో సర్పంచ్ పాము సునీత జెండాను ఎగుర వేయగా, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కనుమాల రామయ్య, గాంధీ బొమ్మ సెంటర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు, బీజేపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ కో కన్వీనర్ వెజ్జు ధర్మారావు జెండా ఎగుర వేశారు. అన్నేవారిగూడెంలో యూపీ పాఠశాల హెచ్ఎం షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామస్తులు భారీ జాతీయ జెండాతో ప్రదర్శన చేశారు. ఎంఈఓ కార్యాలయంలో మండల మానవత అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, గుండుగొలనులో సర్పంచ్ కూర్మా లక్ష్మీ జెండాను ఎగుర వేశారు. క్లాప్ మిత్రలను సత్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం వద్ద ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. మాంటిస్సోరి విద్యాసంస్థలో అధినేత కె.ప్రేమ్‌కుమార్, పోలసానిపల్లి పాఠశాలల్లో సర్పంచ్ షేక్ రహీమాబేగం జెండాను ఆవిష్కరించారు. పాఠశాలల్లో బ్యాగులు పంచారు. గుండుగొలనులోని బాలికల వసతి గృహంలోని బాలికలు 78 సంఖ్యగా కూర్చుని ఆకట్టుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ బి.రమాదేవి, మండల నాయకులు ప్రత్తి మదన్, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొండబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు తదితరులు పాల్గొన్నారు.

భారతీయులంతా గర్వించదగ్గ రోజు

భారతీయులుగా మనమంతా గర్వించదగ్గ రోజు స్వాతంత్ర్య దినోత్సవమని జలవనరుల శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ జాయింట్ కార్యదర్శి మామిళ్లపల్లి కాశీ విష్ణుకుమార్ అన్నారు. గుండుగొలను మధుబాబు ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాశీవిష్ణుకుమార్, సామాజిక కార్యకర్త, రిటైర్డ్ ఉద్యోగి రాజేంద్రప్రసాద్‌లను ఫౌండేషన్ ప్రతినిధులు కొండ వెంకట్రాజు, కొండ గంగారాజ్‌కుమార్, కొండ హరికుమార్‌రాజులు దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంచారు.

ఉత్తమ విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం

గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌కు చెందిన ఎఫ్ఎస్ గ్లోబెల్ ఫౌండర్ రెడ్డి దుర్గాప్రసాద్ తన స్నేహితులు గోవింద్, చింతల వాసులు ద్వారా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన జశ్వంత్ వివేక్, ప్రీతివర్ధినిలకు ఆర్థిక సాయం అందజేశారు. జశ్వంత్ వివేక్‌కు రూ.7 వేలు, ప్రీతి వర్ధినికి రూ.5 వేలు అందించారు. గ్రామంలో పేదలకు తన వంతు సామాజిక సేవా కార్యక్రమాలను అందిస్తున్న దుర్గాప్రసాద్‌ను హెచ్ఎం గారపాటి కనకదుర్గ సునీత, పెద్దలు కొండబాబు, వగ్వాల భాస్కర్, చింతలపాటి శ్రీనురాజు, బంటు విజయకుమార్, టీచర్లు అభినందించారు.


భీమడోలు : గుండుగొలనులో ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి

గణపవరం: ఎందరో మహానుభావులు చేసిన త్యాగాల ఫలితంగా సిద్ధించిన స్వాతంత్ర్య ఫలాలు ప్రతి పౌరునికీ అందిన రోజే నిజమైన స్వాతంత్ర్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరం మండల కార్యాలయం, పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయన జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మండలంలో వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవం అంబాన్ని తాకింది. తహసీల్దార్, ఏఓ, ఎంఈఓ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. గణపవరం సంతమార్కెట్ వద్ద మెడికల్ అసోసియేషన్ సభ్యులు పతాకాన్ని ఆవిష్కరించి, గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. సరిపల్లె పంచాయతీ వద్ద మండల సర్పంచ్‌ల చాంబర్ చైర్మన్ చనుమూరి దుర్గా భవాని, జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ గౌడ్, డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ నిర్మల కుమారి, సీఐ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఆర్అండ్‌బీ, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. గణపవరం, కొత్తపల్లి, జల్లికొమ్మర, అర్ధవరం, వల్లూరు, వాకపల్లి, ముగ్గుళ్ల, ఎ.గోపవరం తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలను సర్పంచ్‌లు ఆవిష్కరించారు.


గణపవరం : జాతీయపతాకాన్ని ఆవిష్కరించిన మెడికల్ అసోసియేషన్ సభ్యులు


గణపవరం: పిప్పరలో పతాకావిష్కరణలో పాల్గొన్న మాజీ మంత్రి ఇందుకూరి

పిప్పరలో: స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ ఇంకా దేశాన్ని పేదరికం వెంటాడటం సిగ్గుచేటని, స్వాతంత్ర్య ఫలాలు అందరికీ సమానంగా అందితేనే అభివృద్ధి సాధ్యపడుతుందని, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. గురువారం పిప్పర శాఖా గ్రంథాలయం వద్ద ఆయన జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. కాశిపాడు, చిలకంపాడు, కేశవరం, మొయ్యేరు, డి.కెవల్లి, కోమర్రు, కొందేపాడు, జల్లికాకినాడ తదితర గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చదవులో ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.


ఉంగుటూరు: కైకరం హైస్కూల్లో విద్యార్థుల విన్యాసాలు

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు : మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.


ఉంగుటూరు: సెంటర్లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఎగురవేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీఓ శర్మ, తహసీల్దార్ సతీష్ తదతరులు పాల్గొన్నారు. ఉంగుటూరు పంచాయతీ కార్యాలయం, పాఠశాల-1, నారాయనపురం పంచాయతీ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. రాచూరు హైస్కూళ్ల వద్ద యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీను జెండా ఎగురవేశారు. విద్యావేత్త రామంజనేయ వర్మ పాఠశాలకు రూ.1 లక్షా 116 విరాళం అందజేశారు. నారాయనపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎ.గోకవరంలో పంచాయతీ సర్పంచ్ మిద్దే సత్యవతి ఆధ్వర్యంలో రైతు, జవాన్‌లను సత్కరించారు. కైకరం, ఉంగుటూరు, గొల్లగూడెం, బొమ్మిడి, బాదంపూడి హైస్కూళ్లలో వేడుకలు నిర్వహించారు. కైకరం హైస్కూల్లో హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి జెండా ఎగురవేశారు.

హైమావతీదేవి భావితరాలకు స్ఫూర్తి

దెందులూరు: దెందులూరు గ్రామంలో హైస్కూల్, ప్రభుత్వ వైద్యశాల, హాస్టల్‌కు స్థలం, భవనాలు ఇచ్చిన గారపాటి హైమావతీదేవి భావితరాలకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం గారపాటి హైమావతీదేవి పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటుచేసిన హైమావతీదేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్, సరస్వతీ దేవి విగ్రహాన్ని రమేష్ హాస్పటల్స్ అధినేత మద్దిపాటి సీతారామ్మోహనరావు ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండా ఎగురవేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్యచౌదరి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఇప్పిలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– జాతీయ జెండాలను తహసీల్దార్ బి.సుమతి, ఎస్సై కె.స్వామి, ఎంపీడీఓ వి.శ్రీలత, ఎంఈఓలు ఎవీఎన్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ తమ కార్యాలయాల్లో, దెందులూరు హైస్కూల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ సత్తానియేలు, జోగన్నపాలెం ఉర్దూ కళాశాలలో కరస్పాండెంట్ వలీవుల్లా ఎగురవేశారు. సెయింట్ మెరిస్ యూపీ పాఠశాలలో హెచ్ఎం టీనా మరియా నేతృత్వంలో జాతీయ నాయకులు చిత్రపటాలకు పూజలు చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్‌లు, గ్రంథాలయాల్లో అధికారులు జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు.


దెందులూరు : హైమావతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రభాకర్


భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

భారీ జాతీయ జెండా ఆవిష్కరణ

పెదవేగి : భోగాపురం జాతీయ రహదారి పక్కనే ఉన్న మన రాష్ట్రంలోనే అతి పెద్దదైన భారీ జాతీయ జెండాను ఉంగుటూరు మండలం కంసాలిగుంట గ్రామానికి చెందిన ముంద్రు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. వెంకటేశ్వరరావు కంసాలిగుంట గ్రామంలో శ్రీ కల్యాణ రామాలయంలో అర్చకులుగా ఉంటున్నారు. ముఖ్య అతిథులుగా పెదవేగి మండలం గార్లమడుగు శ్రీ రామాలయం అర్చకులు చోదిమెళ్ల వెంకన్న బాబు, సమరసత సేవ ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచార్ భూపతి, బీజేపీ నాయకులు విక్రమ్ కిషోర్, కట్నేని కృష్ణ ప్రసాద్, ఎన్ దాన భాస్కర్, పామర్తి రవి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పెదపాడు : ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రత్నకుమారి

పెదపాడు మండలంలో ఘనంగా..

పెదపాడు : మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెదపాడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్‌వీడీవీ ప్రసాద్ జెండా ఆవిష్కరణ చేశారు. ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, సర్వేయర్ కోదండరామ్ వీఆర్వోలు వీఆర్యేలు తదితరులు పాల్గొన్నారు. వీఆర్యేలకు ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలను అందించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ బత్తుల రత్నకుమారి జెండా ఎగురవేశారు. ఎంపీడీఓ జె.తేజరతన్, ఎంఈఓలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసు స్టేషన్ వద్ద ఎస్సై శుభశేఖర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం జెండా ఆవిష్కరించారు. హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అప్పనవీడు హైస్కూల్లో ఎస్ఎంసీ చైర్మన్ మాగంటి లక్ష్మీ దుర్గ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అప్పనవీడు సర్పంచ్ సీహెచ్ ఝాన్సీ, స్థానిక నాయకులు వేమూరి శ్రీనివాసరావు, మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు ప్రధానోపాధ్యాయిని తోట పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి


బువ్వనపల్లి క్యాంపు కార్యాలయంలో జెండా ఎగుర వేసిన మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు/గణపవరం : స్వాతంత్ర్య వేడుకలను గురువారం గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ బువ్వనపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా నేటి తరం నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను, గణపవరం టౌన్ అధ్యక్షుడు రొంగల శ్రీను తదితరులున్నారు. పత్తేపురం మూర్తిరాజు జెడ్పీస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్‌లు జెండా ఎగురవేశారు.

ప్రోత్సాహక బహుమతుల అందజేత

వేలేరుపాడు: పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. వేలేరుపాడు హైస్కూల్‌లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాజీ విద్యాకమిటీ అధ్యక్షుడు కొల్లూరి సూర్యనారాయణ జ్ఞాపకార్థం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని బుర్రి నాగ మౌనికకు రూ. 5వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థిని గారపాటి వర్షినికి రూ.3వేలు విద్యాకమిటీ చైర్మన్ బేటి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో కొల్లూరు సత్యనారాయణ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ద్వారకాతిరుమల: రామసింగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థిని దొప్పసాని లిఖితకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యకర్త కనికెల్లి ధర్మరాజు గురువారం రూ.5 వేలు బహుమతిగా అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ జరిగిన అనంతరం ఈ నగదు బహుమతిని ఆమెకు అందించి, అభినందించారు. ఉప సర్పంచ్ ఉప్పల మునేశ్వరరావు, బిరుదుగడ్డ చల్లారావు, ఎస్ఎంసీ చైర్మన్ దొడ్డా భాస్కరరావు, సభ్యులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి


పారిశుధ్యంపై సమీక్షిస్తున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

దెందులూరు: దెందులూరులో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు ప్రారంభించాలని రోడ్లు, పాఠశాలలు, ఆలయాలతో పాటు ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో నెలలు తరబడి పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఎంపీడీఓ, ఈఓఆర్‌డీలను డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశించారు. గురువారం విగ్రహాల ఆవిష్కరణానికి వచ్చిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పారిశుధ్యంపై పర్యవేక్షణ చేయకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య సమస్య దెందులూరులో మరోసారి ఉత్పన్నమైతే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ వి.శ్రీలత, పార్టీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, మండల నాయకులు మోత్కూరి నాని, పార్టీ నాయకులు మహేష్, తిలక్, ఏసు ఉన్నారు.

ఆహ్లాదకరంగా 'హై టీ'


విద్యార్థినులకు బహుమతి అందిస్తున్న కలెక్టర్, జేసీ

ఏలూరు (ఆర్ఆర్ పేట): జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం హైటీ కార్యక్రమం చక్కని ఆహ్లాదకరం వాతావరణంలో నిర్వహించారు. పలువురు జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారిని జిల్లా కలెక్టర్ కే. వెట్రిసెల్వి దంపతులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసపరిచాయి. కార్యక్రమంలో ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి, ఏఎస్పీ స్వరూపా రాణి, డీఆర్ఓ డి.పుష్పమణి, డీఎఫ్ఓ రవీంద్ర దామ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులకు బయో డైవర్సిటీపై నిర్వహించిన పోటీల్లో వక్తృత్వ విభాగంలో ఏస్ ఈఎస్‌డీఎం స్కూల్‌కు చెందిన వై.దివ్యశ్రీ, శార్వాణి స్కూల్ చెందిన టి.హాస్య సుమ, గాంధీనగర్ మున్సిపల్ హై స్కూల్‌కు చెందిన పి.జెస్సికా, డిబేట్ కాంపిటీషన్లో కేకేఆర్ గౌతమ్ స్కూల్ చెందిన పి.ఎలిష, కస్తూరిబా స్కూల్‌కి చెందిన బి.శ్వేత, లిటిల్ బడ్స్ స్కూల్‌కి చెందిన పి.ఎలీషా, షార్ట్ ఫిలిం విభాగంలో పల్లెర్లమూడి జెడ్పీ హైస్కూల్‌కి చెందిన పి.మౌనిక, శర్వాణి స్కూల్‌కి చెందిన డి.కుసుమ, కైకరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బి.దేవి నాగలక్ష్మిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. వీరికి కలెక్టర్ వెట్రి సెల్వి, జేసీ ధాత్రి రెడ్డి సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న బాలికలకు మెమెంటోలను అందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి ఏలూరుకు చెందిన మద్దుల శ్రీనివాస్ ఆలయ అధికారులను కలిసి సాయి చైతన్య, వాసవి పేరిట రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా.. దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు : దెందులూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ వీ.శ్రీలత తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.